ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వాలి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకీ, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

90
అక్రమ రవాణా

పూర్తి పేర్లు లేకుండా ఈ కథ చెప్పుకుందాం. కె. పటేల్ గారు ఓ విధంగా అమెరికాలో దిగారు. ఓ విధంగా అంటే సరైన కాయితాలు లేకుండా. అది ఎలా అనేదానికి లక్ష రకాల కారణాలు. వచ్చిన వీసా అయ్యాక వెళ్లకుండా ఉండిపోవడం, లేదా కెనడా ద్వారా రావడం వగైరా. అవన్నీ మనకి తెలియవు, అక్కర్లేదు కూడా. అయితే హోటల్లో ఉద్యోగం వచ్చింది, కేష్ డెస్క్ దగ్గిర పనిచేయడం. పోనీ పాపం అనుకునీ, చీప్ లేబర్ అనుకునీ ఓనర్ గారు ఉద్యోగం ఇచ్చారు, నెవడా అనే రాష్ట్రంలో.

నెవాడా అంటే తెల్సిందే కదా, లాస్ వెగాస్ వంటి ప్రదేశాల్లో అన్నింటికీ లైసెన్స్ లు ఇచ్చేస్తారు – పేకాటకీ, గాంబ్లింగ్ కీ, కేసినో కట్టుకోవడానికీ అలా దేనికైనా సరే. ఆ కేసినో లో ఏది ఎలా జరుగుతుంది అనేవన్నీ చూడ్డానికి రాష్ట్ర ప్రభుత్వం వారి గేమింగ్ కమిషన్ అనేది కూడా ఉంటుంది(ట) సినిమాల్లో చూపించినట్టూ. ఇంకా కొంచెం ముందుకి వెళ్తే వ్యభిచార గృహాలకి కూడా లైసెన్స్ ఉంది. ఇండియా మా ఊర్లో 'రాజస్థాన్ టీ స్టాల్' అని బోర్డ్ పెట్టినట్టూ, నెవడాలో

బాహాటంగా ఇది ' వేశ్యల కొంప' అని బోర్డ్ పెట్టి మరీ వ్యాపారం చేయవచ్చు. అందులో పనిచేసేవారికి రూల్స్ రెగ్యులేషన్స్ అన్నీ ఉన్నాయి. వయసు పద్ధెనిమిది దాటితే చాలు, జేబులో డబ్బులు ఉంటే దేనికైనా అర్హులే.

ఇక్కడ "పని" చేయడానికి అనేకానేక దేశాలనుండి పిల్లలనీ అమ్మాయిలనీ అక్రమ రవాణా చేస్తారని ఒక నమ్మిక ఉంది. పట్టుకోనంతవరకూ అన్నీ సజావుగా సాగుతునే ఉంటాయి. ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విషయం మరోటి ఉంది. ఎవరైనా అమెరికా ఉద్యోగం కోసం వస్తే వారికి చెప్తారు ట్రైనింగ్ లో భాగంగా – ఎవెరినైనా మనుషులని, అందులోనూ మైనర్ లని అక్రమ రవాణా చేస్తే జైల్లో పెడతారు. ఇది పెద్ద నేరం. ఈ ట్రైనింగ్ ఒకసారి ఇస్తే మర్చిపోతారని ప్రతీ ఏడు చేసి తీరాలని కొన్ని కంపెనీలు చెప్తాయి కూడా.

అయితే చిన్న చిన్న హోటళ్ళూ, చిల్లర వ్యాపారాలూ ఉద్యోగస్థులకి ఈ ట్రైనింగ్ ఇస్తారో ఇవ్వరో ఎవరూ చెప్పలేరు. పిండి కొద్దీ రొట్టె కదా? మన కె. పటేల్ గారు నెవడా రాష్ట్రంలో తాను సెటిలైపోయానని అనుకున్నాక మరో వింత జరిగింది. లాస్ వెగాస్ కి అమ్మాయిలని పంపించే ముఠా ఒకటి చవగ్గా హోటల్ దొరుకుతుందేమో అని చూస్తూంటే పటేల్ గారి హోటల్ కనిపించింది. వీళ్ళకి ఒక ఎర విసిరారు ఆ ముఠా.

కె. పటేల్ అనే చేప చులాగ్గా పడింది వలలో. కొంతమంది అమ్మాయిలు నెవడా వస్తున్నారు. వాళ్ళకి చవగ్గా హొటల్లో వసతి చూపించాలి. కె. పటేల్ ఆలోచించాడు ఈ సంగతి.

"అమ్మాయిలు వస్తారు సరే. వాళ్ళ ముఠా కూడా హోటల్ ఓనర్ కి డబ్బులిస్తారు. ముఠా, హోటల్ ఓనర్ బాగుపడతారు కానీ మధ్యలో తనకి ఒరిగేది ఏమీ లేదు కదా?" రెండు రోజులు ఆలోచించాక చెప్పాడు, ఆ రాబోయే అమ్మాయిలతో తనకి హొటల్ గదిలో పొందు దొరికితే ఓకే లేకపోతే కష్టం.

ఈ 'కష్టం' అనడంలో 'పోలీస్, ఇమిగ్రేషన్' అనే పదాలు వాడబడ్డాయి. అందువల్ల ముఠా వప్పుకోక తప్పలేదు. ఈ వచ్చే అమ్మాయిలు ఇద్దరూ పదహారు, పదిహేడేళ్ళ పిల్లలు. బలవంతంగా ఈ వృత్తిలోకి దింపారు(ట) వీళ్ళని.

నెవాడా వచ్చాక మొదలైంది పిల్లలకి కష్టం, కె పటేల్ గారి వల్లే. ఈయన కేష్ బాక్స్ లోంచి డబ్బులు తీసి వీళ్ళకి చెల్లించడం, ఇష్టం వచ్చినప్పుడు ఫలానా గదికి రమ్మనడం, ఈ పిల్లల పడుపు వృత్తికి. అదిగాక ఈయన స్నేహితులు కూడా వస్తారుట. కామంతో కళ్ళు మూసుకుపోయిన వారికి అవతల పిల్లల కష్టాలు కనిపించలేదు. ఈ పిల్లలకి కూడా మరో దారి లేదు. ముఠావారు చెప్పిన ప్రకారం వీళ్ళతో సంబంధాలు ఉంచుకోకపోతే హొటల్లోంచి బయటకి పంపుతారు. ఇంత చవగ్గా మరో హొటల్ దొరకదు. అయినా ఇదంతా కొద్దికాలమే – లాస్ వెగాస్ వెళ్ళేవరకూ.

ఎలాగో ఈ కథ ఇమిగ్రేషన్ వారికి చేరింది. వాళ్ళు ఎర వేసి లాగారు. మొదట పడినది అమ్మాయిలు ఇద్దరూను. వీళ్ళిద్దరూ మైనర్లు కనక ముందు వాళ్ళని తరలించారు మరో చోటకి ఎవరికీ తెలియకుండా. అక్కడ తీగ లాగితే మొత్తం డొంక అంతా కదిలింది.

ఆ తర్వాత ఇమిగ్రేషన్ వారొచ్చారు. కె. పటేల్ గార్ని విచారిస్తే మిగతా విషయాలు బయటకొచ్చాయి. ఆయన కేష్ బాక్స్ లో డబ్బులు వాడుకున్నాడు. రెండోది, ఆయన వీసా అయిపోయి చాలాకాలం అయి ప్రస్తుతం ఏ వీసా, కాయితం లేకుండా ఉన్నాడు. మూడోది ఈ 'మైనర్' అమ్మాయిలని చవగ్గా అనుభవించి వదిలేస్తున్నాడు. ఈ మైనర్ అడపిల్లలు తప్పక వప్పుకోవాల్సి వచ్చింది ముఠా రూల్స్ ప్రకారం. ఆ ముఠా డొంక కూడా లాగితే మరో కొంతమంది బయటకొచ్చారు.

అసలు కథ ఏమిటంటే ఈ పిల్లల గురించి ముఠా బాగా ఎడ్వర్టైజ్ చేసి వాళ్ళని విటులకి అమ్ముతున్నార్ట. అయితే వీళ్ళు ఉండడానికి చవకగా కె. పటేల్ పనిచేసే హోటల్ ఎంచుకున్నారు. కె. పటేల్ గారి అవరసరం కూడా తీర్చాలి ఆయన అడిగిన ప్రకారం. అందువల్ల ఇదీ సెటప్.

ఒక్కసారి కూడా అవతల వారు చిన్నపిల్లలనీ, ఇలా మైనర్ తో ఏమీ చేయకూడదనీ, అసలు ఇదంతా అక్రమ మానవ రవాణా, అందులో పాలుపంచుకోకూడదనీ ఎవరికీ తట్టలేదు. మొదటి ప్రశ్న – వీళ్ళకి మనం ముందు చెప్పుకున్న ట్రైనింగ్ ఇచ్చారా? ఇచ్చినా అందులో నేర్చుకున్నది వాళ్ళకి గుర్తు ఉందా? డొంక లాగాక ముగ్గురు దేశీయులు, మరో ఇద్దరు వేరే దేశం వాళ్ళూ బయటకొచ్చారు.

ఈ అక్రమ రవాణా అనేదానికి ఒకటే శిక్ష – కటకటాల్లోకి పంపించడం. అలా శ్రీకృష్ణ జన్మస్థానంలో చేరారు అందరూ. పదేసి సంవత్సరాలు జైల్, ఫైన్, తర్వాత ఇక్కడ వీసా లేకుండా ఉన్నందుకు మరో గొడవ, ఇంకా ఏమైనా ఉంటే అవన్నీ లాగుతారు. 'అక్రమ రవాణా అని నాకు తెలియదు, నా బుర్ర పనిచేయలేదు' అనే కారణాలు చూపించి ఏవో గొడవలు చేసి కేసులు వేస్తారు లాయర్లు. వాళ్ళకి కావాల్సింది డబ్బులు. ఎవరెలా పోయినా వాళ్ళకేల?

ఎన్నేసి కథలు వింటున్నా ఒకటి మాత్రం జరుగుతూనే ఉంది. హోటల్ ఓనర్ గారు చవక అని ఎవర్నో ఒకర్ని కుదుర్చుకుంటున్నారు పనిచేయడానికి వెనకా ముందూ చెక్ చేయకుండా. ఆ బిజినెస్ లో ఉండే కష్టనష్టాలు మనకి తెలియవు కనక దాన్ని గురించి చర్చించడం అనవసరం.

అన్నింటికన్నా ముందు తెల్సుకోవాల్సినది మరొకటి ఉంది.

ఫలానా పని చేయకూడదు అనేది "తప్పు, వప్పు" అనేదానిమీద ఆధారపడి ఉంటుంది కదా? "ఇది తప్పు ఇది ఒప్పు" అని చెప్పేది ఎవరు? సాక్షాత్తూ గుజరాత్ నుంచి వచ్చిన – మహాత్ములుగా మనం కీర్తించే గాంధీ గారు, వల్లభ్ భాయ్ పటేల్ గారు చెప్పినంత మాత్రాన ఎవరూ అలా ఉండడం లేదు కదా? తల్లీ తండ్రీ చెప్పినా కొంచెం పెద్దయ్యాక "నా తల్లితండ్రులకి ఏమీ తెలియదు, నేనే సర్వజ్ఞుణ్ణి" అనేది మనసులో మెదిలినంతకాలం జీవితం ఇంతే.

అయితే ఇటువంటి వారు మారరా అనేదానికి ఒకటే సమాధానం. మార్పు అనేది మారేవాడి మనసులోంచి రావాలి ముందు. ఒకసారి అటువంటి బీజం మనసులో పడితే అప్పుడు అది మహావృక్షంగా ఎదిగి అసలు 'మంచి మనిషి' బయటకి వస్తాడు.

ఇదంతా చదివాక నమ్మకం కుదరకపోతే "పటేల్ ఇండియన్ ట్రాఫికర్" అనేది గూగిలించి తెలుసుకోవచ్చు. ఇటువంటి కథలు కోకొల్లలుగా దొరుకుతాయి.

నీతి: ఏ దేశంలో అయినా సరే, మానవ వనరుల [అక్రమ] రవాణా అతి దారుణమైన నేరం

Post your comments